సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



మరోసారి సేవ చేసే భాగ్యం కల్పించండి

డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను గెలిపించి, సేవ చేసే భాగ్యం కల్పించాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ కోరారు.

- 9లో▸



అసమర్థ పాలనకు చరమగీతం పాడాలి

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అసమర్థ పాలనకు చరమగీతం పాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమయ్య అన్నారు.

- 9లో▸

గరిష్టం/కనిష్టం

30.6°/23.8°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన రెండో ఏఎన్‌ఎంలు



నెహ్రూసెంటర్: జిల్లాలోని రెండో ఏఎన్‌ఎంలు సమ్మె విరమించి విధుల్లో చేరారు. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వారు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. కాగా సోమవారం డీఎంహెచ్‌ఓ అంబరీషకు విధుల్లో చేరుతున్నట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్‌ఎంల యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. గత నెల 16వ తేదీ నుంచి సమ్మె చేపట్టామని, ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి కమిటీ వేసి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం కేసీఆర్ తమను ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే మరోసారి సమ్మె చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వికలాంగుల సమితి జిల్లా నూతన కార్యవర్గం



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టీఆర్‌వీఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రి దేవాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా దేవునిపల్లి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చామకూరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధరావత్ స్వామి, జిల్లా ఉపాధ్యక్షులుగా మాలోతు శంకర్, గుగులోతు సైదులు, జిల్లా గౌరవ సలహాదారుడిగా దుగ్గి సారయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఆర్‌వీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ మున్నా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడిగం ఆంజనేయులు, జనగామ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కన్వీనర్ గుండు రవి, లక్ష్మణ్, రాజు, శ్రీను, సాగర్, చంద్రయ్య, భారత్, సునీత, వెంకటయ్య పాల్గొన్నారు.

ఐసీఎస్‌ఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా గురునాథరావు



విద్యారణ్యపురి: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐసీఎస్‌ఏ) హైదరాబాద్ విభాగం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా మహబూబాబాద్‌కు చెందిన సైన్స్ కమ్యూనికేటర్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ వూరే గురునాథరావును నియమించారు. ఈమేరకు సోమవారం ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్, ప్రొఫెసర్ నాగరాజరావు తెలిపారు. గురునాథరావు రెండు దశాబ్దాలుగా సైన్స్ కమ్యూనికేటర్‌గా రాష్ట్రంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఇండియన్ సైన్స్ రైటర్‌గా, ఇండియన్ ఫిజిక్స్ టీచర్స్ అసోసియేషన్‌లో కూడా జీవితకాల సభ్యుడిగా ఉన్నారు.

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

నెహ్రూసెంటర్: గిరిజనుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సంఘం జిల్లా మూడో మహా సభలను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉంటున్న ఆదివాసీ, గిరిజన తెగల మధ్య చిచ్చుపెడుతూ బీజేపీ ఘర్షణలు సృష్టిస్తుందని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనల్లో గిరిజనుల చావుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కార్పొరేట్లకు అటవీ సంపదను దోచిపెట్టే కుట్రలో భాగంగానే అటవీ సంరక్షణ చట్టాన్ని తీసుకువచ్చి మన్యంలో జీవిస్తున్న ఆదివాసీ, గిరిజనులను అక్కడ నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. గిరిజనులకు గిరిజనబంధు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు పథకంపై ఊసేత్తడం లేదని దుయ్యబట్టారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వెంకన్న, సహాయ కార్యదర్శి భూక్యా హరి, నాయకులు మాలోత్ కిషన్, సీతారాంనాయక్, శాంతికుమార్, సర్పంచ్ సరోజ పాల్గొన్నారు.



సమాజ శిల్పులు.. ఉపాధ్యాయులు

తరగతి గదిలో విద్యార్థిని ఉపాధ్యాయుడు తీర్చిదిద్దే విధానంతో సమాజం, దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ఎంచుకున్న సబ్జెక్టులో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతోపాటు వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను సొంత ఖర్చులతో తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు. సమాజ శిల్పులుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. నేడు (మంగళవారం) జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పలువురు ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు 8లో▸

వినూత్నం.. ఆమె బోధన

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని శనిగపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు బోధన జరుగుతోంది. ఇక్కడ ఉపాధ్యాయురాళ్లు విద్యార్థులకు వినూత్న రీతిలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌తో బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకోవడం, చదవడం, రాయడం, అక్షరాలను గుర్తుపడుతున్నారు. ఇంగ్లిష్ టీచర్ అనిత 'మ్యాజిక్ మ్యాచింగ్' పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. రెయిన్‌బో ఫోనిక్ డ్రిల్‌తో ఇంగ్లిష్ అక్షరాలను కలపడం, పూర్తిగా చదవడం, రాయడం నేర్పుతున్నారు. అలాగే పక్షులు, జంతువుల చిత్రపటాలపై విద్యార్థులు పెన్నుతో గుర్తుపట్టి కరెక్ట్‌గా వాటి పేర్లు చదివితే విద్యుత్ లైటింగ్ వస్తుంది. తప్పుగా చదివితే లైటింగ్‌రాదు. ఇలా వినూత్న రీతిలో ఆమె విద్యార్థులకు బోధిస్తున్నారు.



రెయిన్‌బో చిత్రపటంతో విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పిస్తున్న ఉపాధ్యాయురాలు అనిత

భక్తజన వల్మిడి

కనుల పండువగా రాములోరి ఆలయ ప్రారంభోత్సవం..

- శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్‌స్వామి చేతులమీదుగా విగ్రహాలు, గోపురంపై కలశ ప్రతిష్ఠ
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యవేక్షణలో కొనసాగిన కార్యక్రమం
- హాజరైన మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్
- చుట్టుపక్కల మండలాలనుంచి తరలివచ్చిన భక్తులు
- శ్రీరాముడి నామస్మరణతో మారుమోగిన ఆలయ పరిసరాలు



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భక్తులు, (ఇన్‌సెట్‌లో) శిఖరంపై కలశం, యంత్రం ప్రతిష్ఠిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: తెలంగాణలో మరో భద్రాద్రిగా పేరుగాంచిన జనగామ జిల్లా పాలకుర్తి మండల పరిధి వల్మిడి గ్రామంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం కనుల పండువగా జరిగింది. శ్రీశ్రీశ్రీత్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా సీతారాముల సమేత లక్ష్మణుడు, ఆంజనేయుడి విగ్రహాలు, గోపురంపై కలశాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యవేక్షణలో కొనసాగిన ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరయ్యారు. ముందుగా వారిని మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్ శివలింగయ్య పూర్ణకుంభంతో ఆహ్వానించారు. శ్రీశ్రీశ్రీత్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించగా.. భక్తులు కాషాయ రంగు జెండాలను ప్రదర్శిస్తూ జై శ్రీరాం అంటూ నినదించారు. అనంతరం ఆలయ గోపురంపై జీయర్ స్వామి నవధాన్యాలు ఉంచి కలశస్థాపన చేశారు. కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి, తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కుంకుమ పూజలు చేసి సీతారాముల కల్యాణాన్ని తిలకించి తరించారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేయడంతోపాటు మంచి నీళ్ల బాటిళ్లు అందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్యక్రమం జరిగింది ఇలా..

సోమవారం ఉదయం 4 గంటలకు మంగళ వాయిద్యాలు, నిత్య సేవాకాలం, ప్రబోధికి, ఆరగింపు జరిగాయి. 7 గంటలకు మహా పూర్ణాహుతి, గర్త విన్యాసం, ఉదయం 7.30 గంటలకు శతభిష యుక్త మిథున లగ్నమున శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామివారి చేతులమీదుగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, దిష్టికుంభ ప్రథమ ఆరాధన, శాత్తుమొర్తే నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామచంద్ర స్వామి వారి శాంతి కల్యాణం జరిపించారు. పండిత సన్మానం, గ్రామస్తులు, ప్రముఖులకు ఆశీర్వచనం చేశారు. దీంతో ప్రతిష్ఠ తంతు ముగించారు.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న జీయర్‌స్వామి, పక్కన మంత్రులు



సాంస్కృతిక ప్రదర్శన

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

పాలకుర్తి మండలంలో రూ.160.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంత్రులు దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్‌తో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. సీతారామచంద్రస్వామి ఆలయం, వల్మిడి నుంచి మంచుప్పుల వరకు బీటీ రోడ్డు, బ్రిడ్జి, సోమేశ్వర లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మండపం, పాలకుర్తిలో స్మృతి వనం, మిషన్ భగీరథ గెస్ట్‌హౌస్, ఆలయ ప్రాంగణంలో లింకు రోడ్ల నిర్మాణం, వల్మిడి దేవాలయ గుట్టపైకి ఘాట్ రోడ్డును ప్రారంభించారు. అలాగే.. హరిత టూరిజం హోటల్, సేవాలాల్ మహరాజ్ ఆలయం, నియోజకవర్గ పరిధిలో 8 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.



వల్మిడి రామాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

కేసీఆర్ సర్కార్‌పై జీయర్‌స్వామి ప్రశంసలు..

సాక్షి ప్రతినిధి, వరంగల్: ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం ప్రారంభోత్సవ వేడుకలు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి, సీఎం కేసీఆర్‌ల మధ్య దూరం పెంచిన సంగతి తెలిసిందే. వల్మిడి గ్రామంలో శ్రీ సీతా రామ చంద్ర స్వామి నూతన ఆలయ ప్రారంభం, విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాల్సిన సీఎం.. జీయర్ స్వామి పర్యటన ఖరారు కావడంతో చివరి నిమిషంలో రద్దు చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య ఏర్పడిన వివాదం చర్చనీయాంశంగా మారగా ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో జీయర్‌స్వామి.. కేసీఆర్ సర్కారుపై ప్రశంసల జల్లులు కురిపించడం ఆసక్తిగా మారింది. ఇక.. 'ముచ్చింతల్' వివాదం ముగిసినట్లేనా? అన్న చర్చ సర్వత్రా సాగింది.

యాదాద్రికి దీటుగా వల్మిడి అభివృద్ధి

- వల్మిడికొండనుంచి మునులగుట్టను కలుపుతూ వేలాడే వంతెన నిర్మిస్తాం
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హామీ

- 8లో▸

ఎంసెట్ రాసినవారికి సీటు

- మంత్రి సత్యవతిరాథోడ్



కళాశాల ప్రిన్సిపాల్ బలరాంతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: ఎంసెట్ రాసిన ప్రతీ ఒక్కరికి మానుకోట ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వస్తుందని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బలరాంతో మంత్రి సమావేశమై, కళాశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో ఎంసెట్ రాసిన ప్రతీ విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీ అనుబంధ మహబూబాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ కోర్సుల్లో ప్రవేశం కోం దరఖాస్తు గడువును పెంచారన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో విద్యార్థులు హాజరుకావాలన్నారు. బీటెక్‌లో మొత్తం 5 కోర్సుల్లో 60సీట్ల చొప్పున ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు.

వినతులు త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్: ప్రజావాణి వినతులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి వినతులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కాగా 118 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన వినతుల్లో కొన్ని.. మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన కిరణ్ దళితబంధు పథకానికి దరఖాస్తు చేసుకున్నానని, పథకం రాలేదని, న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశాడు. కేసముద్రం మండలం తిమ్మంపేట గ్రామ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నిర్వహణ అధ్వానంగా ఉందని గ్రామానికి చెందిన చరణ్, చందు, తరుణ్ వినతిలో పేర్కొన్నారు. గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన తారమ్మ తనకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని వినతి ఇచ్చారు. జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'టెట్'ను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఈ నెల 15న టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అనదపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెట్-2023ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ..సమన్వయంతో పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈనెల15వ తేదీన ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పేపర్-1పరీక్షకు 17కేంద్రాల్లో 3,845 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్షకు 15కేంద్రాల్లో 3,242 మంది హాజరవుతారన్నారు. సెంటర్ల వద్దభద్రత ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయని, హాల్‌లోకి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీఓ అలివేలు, డీఈఓ రామారావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం

- మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్




మాట్లాడుతున్న బలరాంనాయక్

గూడూరు: తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన అంతం కావాలంటే కాంగ్రెస్ శ్రేణులు ప్రభంజనంలా గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, నాయకులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో పోలీసులు

మహబూబాబాద్ రూరల్: పోలీసులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని ఎస్పీ చంద్రమోహన్ అన్నారు. మహబూబాబాద్‌టౌన్ పోలీస్ స్టేషన్, షీ టీం, భరోసా సెంటర్లను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వార్నింగ్ బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఉండేలా చూడాలన్నారు. రైతులు పండించిన ధాన్యం రోడ్లపైన ఆరబోయకుండా అవగాహన కల్పించాలన్నారు. దీంతో ప్రమాదాలను కట్టడి చేయవచ్చన్నారు. రాత్రి సమయాల్లో పశువులను రోడ్లపైన వదిలేయకుండా అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు తెలంగాణ పోలీస్ వ్యవస్థ పెద్దపీట వేస్తుందన్నారు. సిబ్బందితో మాట్లాడి షీ టీం, భరోసా సెంటర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఫైళ్లు, రికార్డులు, రైటర్, ఈ కాప్స్, రిసెప్షన్ ఇతర గదులను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ సత్యనారాయణ, టౌన్ సీఐ సతీష్ ఉన్నారు.



షీ టీం, భరోసా కేంద్రంలో ఎస్పీ చంద్రమోహన్

చర్యలు తీసుకోవాలి

కురవి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ చంద్రమోహన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎస్సై గోపి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు ఎంపికైన టీచర్ల జాబితాను డీఈఓ రామారావు సోమవారం విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధుల నిర్వర్తిస్తున్న 46 మంది, ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురిని అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి నేడు(మంగళవారం)జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మధ్యాహ్నం 2:30 గంటలకు అవార్డులు ప్రదానం చేయనున్నాట్లు డీఈఓ తెలిపారు.

ఉత్తములు వీరే..

కునుసోత్ హన్మంత్‌రావు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ అయోధ్యపురం, బానోత్ వెంకట్రామ్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ ఓటాయి, శివరాత్రి అంజయ్య జెడ్పీహెచ్‌ఎస్ పెద్దవంగర, బి.నరేంద్ర జెడ్పీహెచ్‌ఎస్ కేసముద్రం, సీహెచ్.శ్రీనివాస్ జెడ్పీహెచ్‌ఎస్ దంతాలపల్లి, కస్తూరి శ్రీహరి జెడ్పీహెచ్‌ఎస్ కేసముద్రం, ఓ.ఝాన్సీ జెడ్పీహెచ్‌ఎస్ పెద్దవంగర, విజయకుమారి జెడ్పీహెచ్‌ఎస్ గార్ల, ఎం.వెంకన్న జెడ్పీహెచ్‌ఎస్ వీఎస్‌లక్ష్మీపురం, హుస్సేన్ జెడ్పీహెచ్‌ఎస్ పెనుగొండ, ఎం. సంగయ్య జెడ్పీహెచ్‌ఎస్ కన్నెగూడెం, సీహెచ్.స్వామి జెడ్పీహెచ్‌ఎస్ తొర్రూరు, ఎం.జావిదుల్లా బిగ్ జెడ్పీఎస్‌ఎస్ ఆలేరు, పి.జెనిత జెడ్పీఎస్‌ఎస్ నర్సింహులపేట, జి.శ్రీనివాస్ రెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ కోమటుపల్లి, ఎం.భావ్‌సింగ్ జెడ్పీఎస్‌ఎస్ ఉప్పలపాడు, పి.దీపిక జెడ్పీహెచ్‌ఎస్ మోదుగులగూడెం, ఎ.బ్రహ్మానంద జెడ్పీహెచ్‌ఎస్ దంతాలపల్లి, కె.భాస్కర్ జెడ్పీహెచ్‌ఎస్ రాజోలు, కె.సునీత జెడ్పీహెచ్‌ఎస్ మానుకోట, టి.నాగేశ్వర్ రావు జెడ్పీహెచ్‌ఎస్ నేరడ, బి.ఝాన్సీ ఎలిజబెత్ రాణి ఎంపీపీఎస్ పెనుగొండ, పి.రాంచందర్ ఎంపీపీఎస్ వెలుబెల్లి, సీహెచ్.ప్రదీప్‌కుమార్ ఎంపీపీఎస్ సూదనపల్లి, పి.యాదగిరి ఎంపీపీఎస్ గూడేపూడి, ఎ.రవి ఎంపీపీఎస్ జిల్లెగూడెం, జె.కిషోర్ ఎంపీపీఎస్ సూర్యతండా, ఎం.వీరస్వామి ఎంపీయూపీఎస్ తెల్లబండతండా, జి.రవీందర్ ఎంపీయూపీఎస్ కొత్తగూడెం, పి.రంజిత్ ఎంపీపీఎస్ రూపుల్లతండా, వి.మధు ఎంపీపీఎస్ కాకులబోడుతండా, వి.శ్రీనివాస్ ఎంపీపీఎస్ అబ్బాయిపాలెం, జి.యాకయ్య ఎంపీపీఎస్ తొర్రూరు, ఎస్.యుగంధర్ ఎంపీపీఎస్ భగ్గుతండా, ఎల్.వెంకన్న ఎంపీపీఎస్ సోలాతండా, ఎస్.జీవన్‌కుమార్ ఎంపీపీఎస్ మేచరాజ్‌పల్లి, సీహెచ్.ప్రభాకర్ ఎంపీయూపీఎస్ కొరిపల్లి, కె.శ్రీనివాస్ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నెల్లికుదురు, డి.అమరావతి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అనంతారం, నాగమోహన్‌రావు మరిపెడ మోడల్ స్కూల్, పి.శాంతికిరణ్ కల్వల మోడల్‌స్కూల్, ఆంటోనిసోజా గుర్తూరు మోడల్‌స్కూల్, జి.సంగీత నెల్లికుదురు మోడల్ స్కూల్, ఎం.గ్రేసీ కేజీబీవీ డోర్నకల్, డి.నీలిమా కేజీబీవీ తొర్రూరు, పి.ఉప్పలమ్మ కేజీబీవీ మరిపెడ, పి.సురేష్-పాణిని హైస్కూల్ మహబూబాబాద్, కె.ప్రీతి-కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ మానుకోట, పి.ఉదయ్‌శ్రీ-హోలీవర్డ్స్ స్కూల్ మానుకోట, కె.నరేష్‌రెడ్డి-అభ్యాస్ హైస్కూల్ తొర్రూరు, ఎస్.యాకయ్య-అక్షర హైస్కూల్ దంతాలపల్లి ఎంపికయ్యారు.

క్లుప్తంగా

నేడు నెట్ బాల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మెన్ అండ్ ఉమెన్ సీనియర్ నెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్మల్ జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆధార్ కార్డు, నాలుగు పాస్ పోర్టు సైజ్ ఫొటోలను వెంట తీసుకుని ఉదయం 8గంటలకు జేఎన్ఎస్ వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 96182 70940 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డీజిల్ షెడ్ రైల్వే సీనియర్ డీఎంఈగా స్వరాజ్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్ రైల్వే సీనియర్ డీఎంఈగా ఎ.స్వరాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎంఈగా విధులు నిర్వర్తించిన సందీప్‌కుమార్ బదిలీపై సికింద్రాబాద్ మౌలాలి డీజిల్ షెడ్‌కు సీనియర్ డీఎంఈగా వెళ్లారు. ఆయన స్థానంలో మౌలాలి డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా విధులు నిర్వర్తిస్తున్న స్వరాజ్‌కుమార్ కాజీపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ షెడ్ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు స్వరాజ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ సందీప్‌కుమార్‌కు వీడ్కోలు పలికి వారిని సన్మానించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, చైర్మన్ పాక వేదప్రకాష్, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.కె.జానీ, ట్రెజరర్ భిక్షపతి, జి.రాజేశ్వర్, వైస్ చైర్మన్ శంకర్, శివప్రసాద్, నరేష్, దినేష్, బిజ్జా పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కేసముద్రం: ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని తాళ్లపూసపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన దొంతరబోయిన మల్లయ్య, సుభద్ర దంపతుల కుమార్తె రాధిక(32)కు, పదేళ్ల క్రితం దాట్లకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. ఆ తర్వాత విడాకులు కావడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. కాగా, రాధిక తల్లిదండ్రులు బతుకుదెరువు నిమిత్తం కర్నాటకకు వెళ్లారు. ఒంటరిగా ఉంటున్న రాధిక సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు ఆమెను మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. కాగా, మహిళ ఆత్మహత్యపై తమకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ఆర్‌పీఎఫ్ జవాన్..

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి గ్రామానికి చెందిన ఆర్‌పీఎఫ్ జవాన్ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మొగిలి సుధాకర్ (32) కొన్ని సంవత్సరాలుగా భోపాల్‌లో ఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మూడేళ్ల క్రితం తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన మమతతో వివాహం జరిగింది. వీరికి కొడుకు శౌర్య, కూతురు శ్రావణి ఉన్నారు. మమత పిల్లలతో కలిసి అత్తగారింటి వద్దే ఉంటోంది. ఇదిలా ఉండగా సుధాకర్ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.



40 నుంచి 400 మంది విద్యార్థులు..


రిటైర్డ్ టీచర్ రామస్వామి

దంతాలపల్లి: మూసివేసే దశకు చేరిన పాఠశాలలో ప్రస్తుతం 400మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారంటే మాములు విషయంకాదు. పాఠశాలలో 40మందే ఉన్నారని, పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిని సవాల్‌గా తీసుకొని సహ ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెంచామని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తండ రామస్వామి తెలిపారు. రామస్వామి 2000 నుంచి 2005వ సంవత్సరం వరకు నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో పిల్లలు లేరని పాఠశాలలను మూసివేస్తామని ఆదేశాలు వచ్చాయి. దీంతో హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు తేజానంతరెడ్డి, జీవన్‌కుమార్, రామకృష్ణ తదితర ఉపాధ్యాయుల సహకారంతో గ్రామాల్లో తిరిగి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం పొందేలా రామస్వామి కృషి చేశారు. దీంతో అనతికాలంలోనే పాఠశాలలో 400పైగా విద్యార్థులు చదువుతున్నారు.

మూతబడిన పాఠశాలను తెరిపించారు..


విద్యార్థులకు మెమోలు అందజేస్తున్న హెచ్‌ఎం నరేంద్రాచారి

బచ్చన్నపేట: విద్యార్థులు లేరనే కారణంతో ఆ పాఠశాలను రెండు సంవత్సరాలు మూసివేశారు. దీంతో కొందరు విద్యార్థులు 4 కిలో మీటర్లు వెళ్లి బచ్చన్నపేటలో చదువుకునే వారు. దీనిపై చలించిన ఓ హెచ్‌ఎం.. ఎంఈఓ వద్ద ప్రత్యేక అనుమతి తీసుకుని ఆ గ్రామానికి వెళ్లి సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఆ పాఠశాలకు విద్యార్థులను తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం ఆ పాఠశాలలో 5వ తరగతి వరకు 16 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీనిపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ స్కూలే బచ్చన్నపేట మండలంలోని ఎద్దుగూడెం గ్రామ ప్రభుత్వ పాఠశాల. ఆ హెచ్‌ఎం నరేంద్రాచారి. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతోపాటు యోగా, మెడిటేషన్ లాంటి ఇతర అంశాలు కూడా నేర్పిస్తున్నారు. అలాగే, విద్యార్థులకు దాతలతో విద్యాసామగ్రి ఇప్పిస్తున్నారు. దీంతో హెచ్‌ఎం అంకితభావంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులతో మమేకమై బోధన..


విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు లింగారావు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఉడుత గూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లింగారావు కృత్యాధార పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నారు. రోజూ ఉదయం పాఠశాల ప్రార్థన సమయంలోనే విద్యార్థులతో కథలు, గేయాలు, సూక్తులు చదిస్తారు. విద్యార్థులకు అర్థమయ్యేలా వారితో మమేకమై విద్యాబోధన చేస్తారు. ప్రతి నెల తప్పనిసరిగా తల్లిదండ్రుల మీటింగ్ నిర్వహిస్తారు. విద్యార్థులను పంటపొలాలు, పోస్టాఫీస్ తదితర చోట్లకు క్షేత్రస్థాయికి తీసుకెళ్లి వారికి ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉండగా.. ఆ బడిని బతికించేలా మరో ఉపాధ్యాయుడితో కలిసి విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తున్నారు. గత సంవత్సరన్నరకాలంగా పనిచేస్తున్నారు. ఇది నాలుగో స్కూల్. ఎక్కడ పనిచేసినా విద్యార్థులతో మమేకమై విద్యాబోధన చేయడం ఆయన ప్రత్యేకత.

సమాజ శిల్పులు.. ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులు.. సమాజ శిల్పులు. శిల్పి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి రేయింబవళ్లు రాయిని చెక్కి అందమైన విగ్రహంగా రూపొందిస్తాడు. ఇదే కోవలో ఉపాధ్యాయులు కూడా తరగతి గదిలో విద్యార్థికి తన మేధాశక్తిని ధారపోసి బోధన చేపడుతూ వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుతారు. ఇందులో భాగంగా ఒక్కో ఉపాధ్యాయుడు ఒక్కోలా బోధన చేపడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు వినూత్న పద్ధతిలో పాఠాలు బోధించి విద్యార్థుల ఉన్నతికి శ్రమిస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయులు విరమణ పొందినా తమ 'గురు'తర బాధ్యత మరవకుండా పాఠాలు బోధిస్తున్నారు. ఇంకొందరు ఉపాధ్యాయులు.. విద్యార్థులు లేక మూత'బడి' వెలవెలబోయిన పాఠశాలలకు జీవం పోస్తున్నారు. గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ పెద్ద బడులకు పూర్వ వైభవం తీసుకొస్తూ పలువురితో అభినందనలు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ ఉపాధ్యాయులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కాగితపు బొమ్మలతో బోధన..


పిల్లలతో బొమ్మలు తయారు చేయిస్తున్న టీచర్ జయపాల్‌రెడ్డి

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నిమ్మ జయపాల్‌రెడ్డి బోధన తీరు వేరు. ఇలాంటి పద్ధతి దేశంలోనే ఎక్కడా లేదు. పైసా ఖర్చు లేకుండా కాగితపు బొమ్మలు తయారు చేసి (ఒరిగామి) విద్యాబోధన చేస్తున్నారు. చిన్నారులకు ఇష్టమైన విధంగా బొమ్మలు తయారు చేసి వాటితోనే బోధిస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల వరకు పాఠ్యాంశానికి అవసరమైన బొమ్మలను విద్యార్థుల కళ్ల ఎదుటే తయారు చేసి పాఠాలు చెబుతున్నారు. అంతేకాకుండా చిన్నారులతో కూడా బొమ్మలను తయారు చేయించి వారికి కూడా శిక్షణ ఇస్తున్నారు. ఇలా జయపాల్‌రెడ్డి బోధన, తయారు చేసిన కాగితపు బొమ్మలు 2000లో ఇండియన్ టాయ్ ఫెయిర్‌కు ఎంపిక కావడం ఆయన ప్రతిభకు నిదర్శనం. కాగా, కాగితపు బొమ్మలు తయారు చేసి బోధించడం దేశంలో ఎక్కడాలేదని, కేవలం జపాన్‌లోనే ఉందని, అక్కడ ఈ పద్ధతిని ఒరిగామి అంటారని జయపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఈ బోధనపై రాష్ట్రం మొత్తం శిక్షణ ఇస్తానని తెలిపారు.

తెలుగుపై మక్కువ పెరిగేలా..


పాఠం బోధిస్తున్న తెలుగు టీచర్ ఉమాదేవి

విద్యారణ్యపురి: తెలుగు సబ్జెక్ట్ అనగానే మాతృభాషే కదా అని పాఠాలు వినడంలో కొందరు విద్యార్థులు నిర్లక్ష్యంగా ఉంటారు. అయితే వారిలో కూడా తెలుగుపై ముక్కువ కలిగేలా రాగభావ యుక్తంగ విద్యాబోధన చేస్తున్నారు ఓ ఉపాధ్యాయురాలు. ఆమె హనుమకొండ జిల్లా నారాయణ గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఆర్ ఉమాదేవి. కవితలు, కథలు, వ్యాసాలు రాయడంతోపాటు వాటిపట్ల విద్యార్థుల్లోనూ ఆసక్తి కలిగేలా కృషిచేస్తున్నారు. గేయాలు పాడడం.. పాడించడం కూడా చేస్తున్నారు. పిల్లలకు నాటకీయ పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. అంతేగాకుండా వివిధ వ్యాసరచన, ఉపన్యాస, పాటల పోటీల్లో కూడా విద్యార్థులను భాగస్వాములు చేస్తున్నారు. భాగవత శ్లోకాలు కూడా చదిస్తున్నారు.

విద్యాబోధన.. విహార యాత్ర..

● ఆదర్శంగా నిలుస్తున్న హెచ్‌ఎం జానకీదేవి..


జానకీదేవి,హెచ్‌ఎం

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతూ హెచ్‌ఎం పరుపాటి జానకీదేవి ఆదర్శంగా నిలిచారు. నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా బాట వేశారు. తల్లిదండ్రులను మెప్పించి వారిని బడిలో చేర్పించేందుకు ప్రత్యేక కృషి చేశారు. హెచ్‌ఎం ప్రత్యేక చొరవతో మండలంలోని ఏ పాఠశాలలో లేని విధంగా 109 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏ ప్రాథమిక పాఠశాలలో లేని విధంగా 3వ తరగతి నుంచి హిందీ బోధన, అన్ని తరగతుల విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలతో పాటు ప్రైవేట్ పాఠశాల పుస్తకాలతో విద్యాబోధన, యేటా విద్యార్థులను విహార యాత్రలకు తీసుకెళ్తున్నారు. సర్పంచ్ రాజు, ఎంపీటీసీ శిరీష, ఎస్ఎంసీ చైర్మన్ శివప్రసాద్ సహకారంతో పాఠశాలను హరితమయం చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు.

ఆంగ్లంపై ఆసక్తి పెంచుకునేలా..

● కృత్యాధార బోధన చేస్తున్న టీచర్ రవి


కృత్య సామగ్రితో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు రవి

మహబూబాబాద్ రూరల్ : విద్యార్థుల్లో ఉన్న అంతర్గత నైపుణ్యాలు, వ్యక్తిగత, తరగతి గది సామర్థ్యాలను వెలికితీయడానికి మహబూబాబాద్ మండలం జిల్లెల్లగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆవునూరి రవి వినూత్నంగా కృత్యాధార బోధన చేపడుతున్నారు. ఆయన 12 సంవత్సరాలుగా లక్ష్మీపురం గ్రామంలోని ఆదివాసీ ప్రాంతం జిల్లెల్లగూడెంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నేటి ప్రపంచంలో ఆదివాసీ విద్యార్థులు ఆంగ్లంపై ఆసక్తి పెంచుకునేలా కృత్యధార బోధన అవలంబిస్తున్నారు. పలు రకాల కృత్యాలు తయారు చేయడం.. వాటిని తరగతి గదిలో ప్రదర్శించడం.. విద్యార్థులతో స్వయంగా తయారు చేయించడం ఉపాధ్యాయుడు రవి ప్రత్యేకత. ఆయన రూపొందించిన అభ్యసన కృత్య సామగ్రి 2, 3 లెటర్ పదచక్రాలు, వ్యాఖ్యనిర్మాణ చక్రం, 0 నుంచి 999 వరకు నంబర్స్ వీల్, ఫ్రూట్స్, వెజిటెబుల్స్, జంతువుల చార్ట్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

ప్రయోగాత్మకంగా పాఠాల బోధన..


విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధిస్తున్న సుమలత (ఫైల్)

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వెలిదండి సమలత సాంకేతికతను జోడించి ప్రయోగాత్మకంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. జీవశాస్త్రంలో ఉండే పాఠ్యాంశాలను బోధించడానికి స్వయంగా వర్చువల్ రియాల్టీ హెడ్‌సెట్ కొనుగోలు చేసి దాని ద్వారా విద్యార్థులకు మానవ శరీర అవయవాల గురించి వివరిస్తున్నారు. ప్రత్యేక యాప్‌తో సెల్‌ఫోన్‌ను అనుసంధానించి ప్రొజెక్టర్‌పై బొమ్మ చూపిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. విద్యార్థులతో అనేక ప్రాజెక్టులు తయారు చేయించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు పొందేలా చేస్తుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ డ్రామాలు వేయించడం, ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో కదంబ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల అభివృద్ధితో పాటు ప్రభుత్వ పాఠశాల ప్రగతి పథంలో పయనించడానికి పాటు పడుతున్నారు.

సొంతంగా రూ. 80వేల ఖర్చు..


విద్యార్థులకు కుర్చీలు, టీషర్టులు అందజేస్తున్న హెచ్‌ఎం జుగల్ కిశోర్

గార్ల: మండలంలోని సూర్య తండా ఎంపీపీఎస్‌లో ప్రైవేట్ దీటుగా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. హెచ్‌ఎం ఎం. జుగల్ కిశోర్ సొంతంగా రూ.80వేలతో సౌకర్యాలు కల్పించారు. ఆయన బాధ్యతలు స్వీకరించేనాటికి పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉంది. అలాగే, 8 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. దీంతో గ్రామ పెద్దలను కలుపుకొని బడిని అభివృద్ధి చేశారు. ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వపాఠశాలకు పంపాలను తల్లిదండ్రులను కోరారు. దీంతో రెండేళ్ల వరకు 8 మందితో కొనసాగిన పాఠశాలలో ప్రస్తుతం 30 మంది చదువుతున్నారు. తన సొంత డబ్బు రూ.80వేలతో యూనిఫాం, నోట్‌బుక్స్, టై, బెల్ట్‌లు, పరీక్ష ప్యాడ్లు, షూ, కుర్చీలు, క్రీడల టీషర్ట్‌లు కొనుగోలు చేసి పిల్లలకు పంపిణీ చేశారు. దీంతో పాఠశాల అభివృద్ధిని చూసి డీఈఓ, ఎంఈఓ.. హెచ్‌ఎం జుగల్‌కిశోర్‌ను అభినందించారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తూ..


విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోధిస్తున్న రిటైర్డ్ టీచర్ రవికిరణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : నాడు.. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తూ యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దారు. నేడు.. ఉద్యోగ విరమణ పొందినా విద్యార్థులకు తన ప్రయోగాలను నిరంతరం అందజేస్తున్నారు. ఆయనే రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాజీపేట మండల ప్రకాష్‌రెడ్డిపేటకు చెందిన రవికిరణ్‌రెడ్డి. 1998లో రఘునాథపల్లిలోని దోనబండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన ఆయన.. 2019 రాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో రిటైర్డ్ అయ్యారు. గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సైన్స్ ప్రయోగాలపై సేవలందిస్తూనే వరంగల్‌లోని ప్లాంటోరియం డైరెక్టర్‌గా, జిల్లా సైన్స్ అధికారిగా, జిల్లా నేషనల్ గ్రీన్ క్రాలప్స్ కన్వీనర్‌గా, జిల్లా ఎన్‌సీఎస్‌సీ కోఆర్డినేటర్‌గా వ్యవహించారు. ప్రస్తుతం విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు బోధన చేపడుతూ, సైన్స్ ఉపాధ్యాయులకు మెళకువలు నేర్పుతున్నారు. 'సేవ్ ద సాయిల్', 'ఆర్గానిక్ ఫార్మింగ్', 'ఆస్ట్రానమీ', 'స్పేస్', 'సైన్స్' ప్రయోగాలపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్తూ అనంత లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


కిష్టయ్య(ఫైల్)

బచ్చన్నపేట : కూతురు ఆస్పత్రిలో డెలివరీ కావడంతో ఆమెకు భోజనం తీసుకెళ్తున్న ఓ వృద్ధుడు.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన దేవరకొండ కిష్టయ్య (69) కూతురు జనగామలోని చంపక్ హిల్స్ వద్ద గల మాతాశిశు ఆస్పత్రిలో డెలివరీ అయింది. ఈ క్రమంలో కిష్టయ్య.. ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై కూతురుకు భోజనం తీసుకెళ్తున్నాడు. మండలంలోని తమ్మడపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడే పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన కిష్టయ్యను జనగామలోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్సై కంకల సతీష్ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మరో వృద్ధుడు..


ఐలయ్య(ఫైల్)

వర్ధన్నపేట: బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ వద్ద జరిగింది. పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన కన్నె ఐలయ్య (66) తన కూమారుడి వివాహం ఇటీవల జరిగింది. వరంగల్ భద్రకాళి దేవాలయంలో పూజలు నిర్వహించడానికి తన బైక్‌పై వధూవరులతో కలిసి వెళ్తున్నారు. ఉప్పరపల్లి క్రాస్ నుంచి వరంగల్ వైపునకు వెళ్లడానికి రోడ్డు దాటుతున్న క్రమంలో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో ఐలయ్య బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఐలయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కేయూ పరిధిలో పలు పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 6వతేదీన జరగాల్సిన బీపీఈడీ నాలుగు, ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, అలాగే ఈనెల 8న జరగాల్సిన ఎంబీఏ నాలుగు సెమిస్టర్ పరీక్షలు, మూడేళ్ల లా కోర్సు ఆరో సెమిస్టర్ పరీక్షలు, ఐదేళ్ల లాకోర్సు 10వ సెమిస్టర్ పరీక్షలు వాయిదావేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక సోమవారం తెలిపారు. ఆయా పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఆయా పరీక్షల రీషెడ్యూల్ టైంటేబుల్‌ను కేయూ వెబ్‌సైట్‌లో ఈనెల 5న అందుబాటులో ఉంచనున్నట్లు వారు తెలిపారు.

యాదాద్రికి దీటుగా వల్మిడి అభివృద్ధి

● రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


వల్మిడి సీతారామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు


సోమనాథుడి స్మృతివనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు. మాట్లాడుతున్న మంత్రులు ఎర్రబెల్లి, అల్లోల

పాలకుర్తిటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రికి దీటుగా వల్మిడి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో సోమవారం జరిగిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునఃప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో నూతన దేవాలయాల నిర్మాణమే కాకుండా జీర్ణదశలో ఉన్న టెంపుల్స్‌లో ధూపదీప నైవేద్యం కింద ఇప్పటికే ఏడు వేల దేవాలయాలకు నిధులు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పురాతన దేవాలయాల అభివద్ధితో పాటు నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలకు సైతం ఈ ప్రభుత్వం నిధులను సమకూరుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఆలయాల నిర్మాణం, పునరుజ్జీవం చేస్తూ ప్రజల్లో మరింత భక్తి భావాన్ని పెంచుతున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న పదేళ్లలో రాష్ట్రంలో ఎటువంటి కరువు కాటకాలు రాలేదని, ఆ దేవుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉన్నాయన్నారు. మునులగుట్టపై రామానుజ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చినజీయర్ స్వామి కోరికను స్వాగతిస్తున్నామన్నారు. అదేవిధంగా శ్రీ సీతారామచంద్ర స్వామి కొండ నుంచి మునులగుట్టను కలుపుతూ వేలాడే వంతెన నిర్మాణం చేపడుతామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

సీఎం కేసీఆర్ బాటలో మంత్రి ఎర్రబెల్లి : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

దేవాలయాల అభివృద్ధిలో సీఎం కేసీఆర్ బాటలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నడుస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ చేసిన ఆయుత చండీ యాగం వల్లే రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండుతున్నాయని, ఆయన కృషితో ఇవాళ యాదాద్రి పుణ్యక్షేత్రం తెలంగాణ తిరుపతిగా భాసిల్లుతోందని పేర్కొన్నారు. బమ్మెర, పాలకుర్తి, వల్మిడి గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు మంత్రి ఎర్రబెల్లి తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

ఆలయాల పునరుజ్జీవం కేసీఆర్ ఘనతే : మంత్రి సత్యవతి

ఆలయాల పునరుజ్జీవం ఘనత సీఎం కేసీఆర్‌దేనని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వందల కోట్ల రూపాయల నిధుల మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి.. గొప్ప చరిత్ర కలిగిన వల్మిడి గ్రామంలో సీతారాముల ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని కొనియాడారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా పాలకుర్తి : మంత్రి ఎర్రబెల్లి

సీఎం కేసీఆర్ సహకారంతో పాలకుర్తిని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ క్రమంలోనే రూ.39 కోట్లతో వల్మిడి ఆలయాన్ని భద్రాద్రి తరహాలో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఇక్కడ వేద పాఠశాల ఏర్పాటు చేస్తామని, అలాగే పాలకుర్తి, బమ్మెర, చెన్నూరు గ్రామాలను ఆధ్యాత్మిక, పర్యాటక కారిడార్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇందుకు రూ.160 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, మై హోం అధినేత రామేశ్వర్ రావు, జనగామ కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వీరమల్ల జైహింద్, ఈఓ లక్ష్మీప్రసన్న, ఎంపీపీ నల్లనాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, సర్పంచ్ సైదులు పాల్గొన్నారు.